

నేడు, రేపు ఆదిత్యుడిని తాకనున్న కిరణాలు

అరసవల్లి, మార్చి 8(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యప్రదాత, ప్రత్యక్షదైవం.. అరసవల్లి ఆదిత్యుడి మూలవిరాట్‌ను ఆది, సోమవారాల్లో సూర్యకిరణాలు తాకనున్నాయి. ఏటా మార్చి 9, 10వ తేదీల్లో ఆదిత్యుడిని సూర్యకిరణాలు తాకడం ఆనవాయితీగా వస్తోంది. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం 6 నుంచి 6.30 గంటల మధ్య అనివెట్టి మండపం మీదుగా గర్భగుడిలో స్వామి మూలవిరాట్‌ను సూర్య కిరణాలు స్పృశించనున్నాయి. ఆదిత్యుడు బంగారు వర్ణంలో భక్తులకు కనువిందు చేయనున్నారు. అక్టోబరు 1, 2 తేదీల్లో కూడా ఇదే విధంగా సూర్యనారాయణస్వామిని సూర్యకిరణాలు తాకుతాయి.

ఇంటికో మహిళా పారిశ్రామికవేత్త

- వెలుగు 2.0 కార్యక్రమంతో సరికొత్త లక్ష్యం
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్
- ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



జిల్లా మహిళా సమాఖ్య ఉపాధ్యక్షురాలు గంగమ్మను సన్మానిస్తున్న మంత్రి కె.శ్రీనివాస్. చిత్రంలో ఎమ్మెల్యేలు కూన రవికుమార్, గౌతు శిరీష, బగ్గు రమణమూర్తి, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

అరసవల్లి, మార్చి 8(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఇంటి నుంచి ఒక మహిళా పారిశ్రామిక వేత్త తయారు చేయడమే లక్ష్యంగా వెలుగు 2.0 కార్యక్రమాన్ని రూపొందించినట్లు గ్రామీణ పేదరిక నిర్మూలన, ఎన్ఆర్ఐ సాధికారత సంబంధాల శాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధ్యక్షతన స్థానిక 80 అడుగుల రోడ్డులోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో శనివారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. సాంస్కృతిక ప్రదర్శనలు, సందేశాత్మక ముగ్గులతో మహిళలు అలరించారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో స్టాల్స్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ.. 'మహిళా భాగస్వామ్యం లేకుండా సామాజిక ప్రగతి అసాధ్యం. పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యం. వెలుగు పథకం ద్వారా 25 ఏళ్లుగా మహిళలకు ఎన్నో అవకాశాలు కల్పించి మహిళా సాధికారత దిశగా కృషి చేశామ'ని తెలిపారు.

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ.. 'పనిచేసే చోట మహిళలు వేధింపులకు గురైతే హెల్ప్‌లైన్ నెంబర్ 181కు ఫోన్ చేయాలి. సఖీ కేంద్రం, వన్‌స్టాప్ సెంటర్ ఆధ్వర్యంలో సమాజంలో బాలికలు, మహిళలు, మానసిక, శారీరక హింసలకు గురైతే వెంటనే సంప్రదించాలి. వారికి తక్షణ సహాయం లభిస్తుంది. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాల'ని సూచించారు.
- ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ.. 'మహిళా భద్రతకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. నేటి నుంచి ప్రతి పోలీసుస్టేషన్‌లో (మిగతా 7వ పేజీలో..)



ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన





ఎల్లమ్మ ఆలయం వద్ద భక్తుల రద్దీ

ఎల్లమ్మా.. కరుణించమ్మా..

- 'జామి' జాతరకు పోటెత్తిన భక్తులు

పలాస, మార్చి 8(ఆంధ్రజ్యోతి): కోర్కెలు తీర్చే కల్పవల్లి, వ్యాధులు నయం చేసే ధన్వంతరిగా పేరుగాంచిన జామి ఎల్లమ్మ జాతర శనివారం ఘనంగా జరిగింది. పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల్లో ప్రధాన రహదారులన్నీ భక్తులతో నిండిపోయాయి. అమ్మవారి ఆలయానికి భక్తులు తండోపతండాలుగా వచ్చి.. దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. క్యూలైన్లు కిటకిటలాడాయి. కిలోమీటరు పొడవున రోడ్డుపై ఎండలోనే భక్తులు క్యూలో నిలుచొని అమ్మవారిని దర్శించుకోవాల్సి వచ్చింది. పోలీసులు, మున్సిపల్ అధికారులు, ఆలయ అభివృద్ధి కమిటీ సమన్వయంతో ఏర్పాట్లు చేశారు. అమ్మవారి ఆలయంలోకి ప్రవేశించేందుకు మూడు క్యూలైన్లు ఏర్పాటు చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నారు. మాజీమంత్రి గౌతు శ్యామసుందర శివాజీ, ఏపీటీపీసీ ఛైర్మన్ వజ్జ బాబూరావు, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పీరుకట్ల విఠల్‌రావు, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి లొడగల కామేశ్వరరావు యాదవ్, గురిటి సూర్యనారాయణ, పీసీఎంఏ ప్రధాన కార్యదర్శి టంకాల రవిశంకర్ గుప్తా (మిగతా 8వ పేజీలో..)

భక్తుల ఇలవేల్పు.. వల్లభ నారాయణుడు

- నేటి నుంచి 14 వరకు రట్టిలో డోలోత్సవాలు
- ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

8 లో

లోక్‌అదాలత్‌లో 2,212 కేసులు రాజీ

- జిల్లా న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా

గుజరాతీపేట, మార్చి 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 2,212 కేసులు రాజీ అయ్యాయి. ఇందులో 127 సివిల్ కేసులు, 2,074 క్రిమినల్, 11 ప్రీ లిటిగేషన్ కేసులు రాజీ అయ్యాయని జిల్లా న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా తెలిపారు. కక్షిదారులకు పరిహారం చెక్కులు అందజేశామన్నారు. జిల్లా కోర్టు ఆవరణలో నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో నాలుగో అదనపు జిల్లా న్యాయాధికారి వై.యుగంధర్, అదనపు సీనియర్ సివిల్ న్యాయాధికారి జమ్రత్ బేగం, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, న్యాయాధికారులు తదితరులు పాల్గొన్నారు.



కక్షిదారులకు పరిహారం చెక్కును అందజేస్తున్న జిల్లా న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా

ద్రాక్ష పండ్ల వ్యాన్ బోల్తా

- డ్రైవర్ నిద్రమత్తు కారణంగా అదుపు తప్పిన వైనం
- పండ్లు ఏరుకునేందుకు ఎగబడిన జనం

ఎచ్చెర్ల, మార్చి 8(ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్ల మండలంలోని కొయ్యరాళ్ల జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై శనివారం సాయంత్రం ఓ ద్రాక్ష పండ్ల వ్యాన్ బోల్తాపడింది. మహారాష్ట్ర నుంచి ద్రాక్ష పండ్ల లోడ్‌తో ఓ వ్యాన్ వెస్ట్ బెంగాల్ వెళ్తోంది. ఈ క్రమంలో కొయ్యరాళ్ల జంక్షన్ వద్ద డ్రైవర్ నిద్రమత్తు కారణంగా అదుపు తప్పి వ్యాన్ బోల్తా పడింది. అందులో ఉన్న ద్రాక్ష పండ్లన్నీ ట్రేలతో సహా చెల్లాచెదురుగా (మిగతా 8వ పేజీలో..)



రోడ్డు మీద పడిన ద్రాక్షపండ్లను ఏరుతున్న ప్రజలు


పాతపట్నం: ఎస్ఐను సత్కరిస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు


నరసన్నపేట: మాట్లాడుతున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి


అరసవల్లి: రెడ్‌క్రాస్ భవనంలో ఎమ్మెల్యే శంకర్ సతీమణి స్వాతి..


రణస్థలం: పెళ్లిరోజు జరుపుకుంటున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్ దంపతులు

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

అరసవల్లి, మార్చి 8(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధ్యక్షతన స్థానిక 80 అడుగుల రోడ్డులో గల ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలులో శనివారం ఘనంగా నిర్వహించారు. అలాగే స్థానిక టీడీపీ జిల్లా కార్యాలయం వద్ద ఉన్న ఆ పార్టీ వ్యవస్థాపకులు, దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు విగ్రహానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ నివాళులర్పించారు.

33శాతం రిజర్వేషన్: ఎమ్మెల్యే బగ్గు

మహిళలకు స్థానిక సంస్థల్లో, విద్య, ఉద్యోగాల్లో 33శాతం రిజర్వేషన్లు చంద్రబాబు కల్పించారని, దీని ఫలితంగా నేడు మహిళలు సమాజంలో అన్ని రంగాల్లో రాణిస్తున్నారని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మహిళా స్వయం సహాయక సంఘాలను స్థాపించి, వారిని ఆర్థిక స్వావలంబన దిశగా నడిపించడం జరిగిందన్నారు.

పురుషులకు దీటుగా మహిళలు: ఎమ్మెల్యే శిరీష

మహిళలు అన్ని రంగాల్లో పురుషులకు దీటుగా రాణిస్తున్నారని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. ప్రతీ స్త్రీ విజయం వెనుక ఇద్దరు ప్రధానపాత్ర పోషిస్తారని, అందులో ఒకరు తండ్రి కాగా, మరొకరు భర్త అని అన్నారు. అవకాశాన్ని అంది పుచ్చుకుని ముందుకు సాగడం స్త్రీ ప్రత్యేకతన్నారు.

ఉగాది నుంచి ఉచిత బస్సు: ఎమ్మెల్యే కూన

మహిళా సాధికారతకు దేశంలోనే తొలి అడుగు వేసింది టీడీపీయేనని, దివంగత ఎన్టీఆర్ మహిళలకు ఆస్తిలో సమాన హక్కు కల్పించారని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. చంద్రబాబు మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల అమలు చేసి రాష్ట్రాన్ని మహిళా సాధికారత దిశగా నడిపించారన్నారు. రానున్న ఉగాది నుంచి మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణానికి సన్నాహాలు జరుగుతున్నాయని తెలిపారు.

మహిళల నడుమ ఎమ్మెల్యే పెళ్లి రోజు

రణస్థలం, మార్చి 8(ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు, సతీమణి రజిని పెళ్లిరోజు వేడుకలు శనివారం మహాలక్ష్మీతల్లి ఆలయ ప్రాంగణంలో ఘనంగా జరుపుకున్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని, మహిళలతో కొంత సమయం గడిపారు.

టీడీపీ హయాంలోనే మహిళా సాధికారత: ఎంజీఆర్

పాతపట్నం, మార్చి 8(ఆంధ్రజ్యోతి): టీడీపీ పాలనలోనే మహిళా సాధికారత సాధ్యమైందని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. స్థానిక బీసీ సామాజిక భవనంలో అంతర్జాతీయ మహిళాదినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలకు ఆస్తిలో సమాన వాటా కల్పించిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కిందన్నారు. అనంతరం ఎంపీడీవో చంద్రకుమారి, ఎస్ఐ బి.లావణ్య, తదితర మహిళలను సత్కరించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో ఎల్‌వీఎన్ శ్రీధర్‌రాజా, అంగన్‌వాడీ కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

నరసన్నపేట, మార్చి 8(ఆంధ్రజ్యోతి): మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని, దీనికి కూటమి ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. శనివారం అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర కాళింగ కార్పొరేషన్ ఛైర్మన్ రోణంకి కృష్ణంనాయుడు, పార్టీ నాయకులు శిమ్మ చంద్రశేఖర్, కింజరాపు రామారావు, గొద్దు చిట్టిబాబు పాల్గొన్నారు.


అరసవల్లి: స్టాల్స్ పరిశీలిస్తున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీనివాస్

మహిళలతోనే ప్రగతి

పలాస, మార్చి 8(ఆంధ్రజ్యోతి): మహిళలతోనే ప్రగతి సాధ్యమని కాశీబుగ్గ డీఎస్పీ వి.వెంకట అప్పారావు అన్నారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈయూ గౌరవాధ్యక్షుడు దువ్వాడ శ్రీధర్ మాట్లాడుతూ.. ఆర్టీసీ సంస్థలో మహిళలకు అధిక ప్రాధాన్యం ఉందన్నారు. ఈ సందర్భంగా మహిళా కార్మికులకు జ్ఞాపికలు ఇచ్చి సత్కరించారు. కార్యక్రమంలో ఏడీ దిలీప్‌కుమార్, రాజు, డాక్టర్ సునీలతో పాటు శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం డిపోల మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.


అరసవల్లి: యూటీఎఫ్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్సీ శర్మ..


శ్రీకాకుళం కలెక్టరేట్: ఏపీ జేఏసీ ఆధ్వర్యంలో..


శ్రీకాకుళం అర్బన్: ఏపీఎన్జీవో మహిళా విభాగం ఆధ్వర్యంలో..


అరసవల్లి: రిమ్స్ సర్వజన ఆసుపత్రిలో..


కవిటి: బల్లిపుట్టుగలో కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ చిన్నబాబు ఆధ్వర్యంలో..


ఆమదాలవలస: పురపాలక సంఘ కార్యాలయంలో..


పలాస: ఆర్టీసీ మహిళా కార్మికులతో అధికారులు, దువ్వాడ శ్రీధర్


టెక్కలి: టీడీపీ కార్యాలయంలో..


ఎచ్చెర్ల: చిలకపాలెం శివానీ ఇంజనీరింగ్ కళాశాలలో..


కోటబొమ్మాళి: టీడీపీ కార్యాలయంలో..


ఎచ్చెర్ల: బీఆర్ఏయూలో మాట్లాడుతున్న వీసీ రజని


అరసవల్లి: ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు

ఆర్థిక సాయం

సోంపేట, మార్చి 8(ఆంధ్రజ్యోతి): మాకన్నపురం గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబం దట్టి జయమ్మ కుమార్తె వివాహానికి ఆ గ్రామ ఎంఎస్ఆర్ యువత రూ.50వేల ఆర్థిక సాయం చేశారు. టీడీపీ నాయకులు, ఎంఎస్ఆర్ యువసేన ప్రతినిధులు మద్దిల నాగేశ్వరరావు, నల్ల శ్యామలరావు, మల్లా కోదండరావు, ఉలాల హరికృష్ణ, బతకల దీర్ఘారావు తదితరులు ఉన్నారు.

నవగ్రహ హోమ పూజలు

సరుబుజ్జిలి, మార్చి 8(ఆంధ్రజ్యోతి): స్థానిక ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాటు చేస్తున్న నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా నిర్వహిస్తున్నారు. రెండో రోజు శనివారం యజ్ఞశాలలో పలువురు దంపతులు సామూహికంగా హోమపూజలు చేశారు. ఉదయం ఆరు గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు వేద పండితులు వైభవంగా నిర్వహించారు.

సైకిల్ ట్యూబ్ వాల్‌పిన్ మింగిన బాలుడు


పిన్‌ను తీస్తున్న వైద్యులు

రాజాం రూరల్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లాలోని జి.సిగడాం మండలంలో గల గెడ్డకంచరాంలో ఏడాది వయసు గల దుర్గా ప్రసాద్ ఇంటి ఆవరణలో ఆడుకుంటున్న సమయంలో సైకిల్ ట్యూబ్ వాల్‌పిన్ శనివారం మింగేశాడు. దీంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న బాలుడిని గుర్తించిన తల్లిదండ్రులు హుటాహుటిన రాజాంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. ఎండోస్కోపీ ద్వారా పరిశీలించి, అన్నవాహికలో పిన్ చిక్కుకున్నట్లు వైద్యుడు గుర్తించారు. దీంతో మింగేసిన వాల్‌పిన్‌ను సురక్షితంగా తొలగించడంతో దుర్గా ప్రసాద్ ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు.

మెగా డీఎస్సీకి ఉచిత శిక్షణ

అరసవల్లి, మార్చి 8(ఆంధ్రజ్యోతి): టెట్‌లో అర్హత సాధించిన బీసీ, ఈబీసీ కేటగిరీకి చెందిన అభ్యర్థులకు మెగా డీఎస్సీ పరీక్షకు సంబంధించి ఉచిత శిక్షణను ఇవ్వనున్నట్లు బీసీ స్టడీ సర్కిల్, శ్రీకాకుళం సంచాలకులు ఇ.అనూరాధ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన అభ్యర్థులు పది, ఇంటర్, డిగ్రీ మార్కుల జాబితాలు, కుల, ఆదాయ ధవపత్రం (రూ.2లక్షల లోపు), టెట్ మార్కుల జాబితా, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో నగరంలోని 80 అడుగుల రోడ్డులో గల టీడీపీ జిల్లా కార్యాలయం వెనుక గల ఏపీ బీసీ స్టడీ సర్కిల్‌లో నేరుగా ఈ నెల 10వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 73829 75679, 92956 53489 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

లక్ష్మీనరసింహ స్వామి సన్నిధిలో ఎమ్మెల్యే


విప్‌ను ఆశీర్వదిస్తున్న వేదపండితులు

సోంపేట, మార్చి 8(ఆంధ్రజ్యోతి): తాళ్లభద్రలో లక్ష్మీనరసింహ స్వామిని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బెందాళం అశోక్ శనివారం దర్శించుకున్నారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఇంటికో మహిళా పారిశ్రామికవేత్త

(ఐదో పేజీ తరువాయి)

మహిళల కోసం ప్రత్యేకంగా హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేస్తున్నాం. మహిళా పోలీసులు అందుబాటులో ఉంటారని తెలిపారు.

● అనంతరం వివిధ రంగాల్లో రాణించిన మహిళలను సత్కరించారు. 1,674 స్వయం సహాయక సంఘాలకు రూ.111.51 కోట్ల స్త్రీ నిధి రుణాలను, మెప్మా ఆధ్వర్యంలో 129 సంఘాలకు రూ.9.72కోట్ల బ్యాంకు లింకేజి రుణాలు, దివ్యాంగ బాలికలకు ల్యాప్‌టాప్‌లను మంత్రి శ్రీనివాస్ అందజేశారు. బీసీ కార్పొరేషన్ ద్వారా బేసిక్ టైలరింగ్ పథకం కోసం రూ.8.5కోట్లు, ప్రధానమంత్రి అజయ్ పథకం కింద 38 మంది ఎస్సీ లబ్ధిదారులకు రూ.63లక్షల చెక్కును, ఉత్తమ మహిళా పారిశ్రామికవేత్తలైన ప్రేరణ సఖిలకు రూ.2లక్షల చెక్కులను పంపిణీ చేశారు. జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు గంగమ్మ చేసిన ప్రసంగానికి చప్పట్లతో ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఉప కలెక్టర్ పద్మావతి, శ్రీకాకుళం ఆర్డీవో సాయిప్రత్యూష, సీపీవో ప్రసన్నలక్ష్మి, ఐసీడీఎస్ పీడీ శాంతిశ్రీ, వ్యవసాయాధికారి త్రినాథస్వామి, డీఆర్డీఏ పీడీ కిరణ్‌కుమార్, డీఆర్వో ఎం.వేంకటేశ్వరరావు, బీసీ కార్పొరేషన్ ఈడీ గడ్డెమ్మ, డీఎంహెచ్‌ఓ బాలమురళీకృష్ణ, లీడ్ బ్యాంకు మేనేజర్ సూర్యకిరణ్, దివ్యాంగుల శాఖ ఏడీ కె.కవిత పాల్గొన్నారు.

మహిళ భద్రతకు తొలి ప్రాధాన్యం : ఎస్పీ


ర్యాలీలో పాల్గొన్న పోలీసు అధికారులు

రక్త పరీక్షలు చేయించుకుంటున్న ఎస్పీ

శ్రీకాకుళం క్రైం, మార్చి 8(ఆంధ్రజ్యోతి): మహిళలంతా సంపూర్ణ ఆరోగ్యంగా ఉన్నప్పుడే పరిపూర్ణమైన ప్రగతి సాధ్యమని, మహిళల భద్రతకు పోలీసు యంత్రాంగం తొలి ప్రాధాన్యం ఇస్తుందని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని జిల్లాలో విధులు నిర్వహిస్తున్న 229 మంది మహిళా పోలీసులకు జెమ్స్ ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎస్పీ ప్రారంభించి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లాలో గతవారం రోజులుగా మహిళా సాధికారిత వారోత్సవాలు నిర్వహించామన్నారు. తొలుత జిల్లా పోలీసు కార్యాలయంల నుంచి డేఅండ్ నైట్ కూడలి వరకు ఏఎస్పీ కేవీ రమణ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు. డీఎస్పీలు సీహెచ్ వివేకానంద, ఎల్.శేషాద్రి, సీఐలు పైడపునాయుడు, ఈశ్వరరావు, సత్యనారాయణ, ఎస్ఐలు హరికృష్ణ, జనార్దన్, రాము, సందీప్, ప్రవల్లిక, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'సాంకేతిక ఉత్సవ్'


డ్రోన్‌ను పరిశీలిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల, మార్చి 8(ఆంధ్రజ్యోతి): స్థానిక ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో జరుగుతున్న సాంకేతిక ఉత్సవ్ రెండో రోజు శనివారం ఉత్సాంగా జరిగింది. క్విజ్, టెక్నికల్ ఈవెంట్స్, ప్రాజెక్టుల ప్రదర్శన, పోస్టర్ల ప్రదర్శన చేపట్టారు. గుహావటి ఐఐటీ ఆచార్యులు విజయసారధి, వీఎన్ ఐటీ నాగ్‌పూర్ మెకానికల్ విభాగానికి చెందిన డాక్టర్ అతుల్ రమేష్ బాలల్ వివిధ అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. క్యాంపస్ డైరెక్టర్ బాలాజీ, ఏవో ముని రామకృష్ణ, అకడమిక్ డీన్ కొర్ల మోహన్ కృష్ణ, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

రాజమ్మ జాతరకు బందోబస్తు


సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఎస్ఐ

గార మార్చి 8(ఆంధ్రజ్యోతి): వత్సవలసలో ఆదివారం జరగనున్న రాజమ్మ జాతరకు 70 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ మేరకు సీఐ పైడపునాయుడు, గార ఎస్ఐ ఆర్.జనార్ధనరావు ఆధ్వర్యంలో ఈ యాత్రలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తు ఏర్పాటు చేపట్టారు. ఆదివారం ఉదయం సముద్రతీరంలో భక్తులు స్నానాలు ఆచరించే దగ్గర సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేసినట్టు మెరైన్ సీఐ బి.ప్రసాదరావు తెలిపారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

శ్రీకాకుళం క్రైం, మార్చి 8(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ విరమణ అనంతరం ఆరోగ్యంపై శ్రద్ధ వహించి, కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి సూచించారు. జిల్లా హోంగార్డు విభాగంలో టెక్కలి పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న బిడ్డిక అప్పలస్వామి శనివారం ఉద్యోగ విరమణ పొందడంతో అతడిని జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ మహేశ్వరరెడ్డి సత్కరించారు. కార్యక్రమంలో ఏఎస్పీ కేవీ రమణ, డీఎస్పీ ఎల్.శేషాద్రి, ఆర్ఎస్ఐలు రమణ, నీలిమ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు మహాసంఘ సమావేశంలో ఎమ్మెల్యే శంకర్


సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే గొండు శంకర్

అరసవల్లి, మార్చి 8(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం రాయపూర్‌లో తెలుగు మహా సంఘ సమావేశాలు రెండు రోజులపాటు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ రమణ, అధికార భాషా సంఘం అధ్యక్షుడు, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, సినీ నటుడు సాయికుమార్, అలాగే శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ హాజరయ్యారు.

దువ్వాడపై జనసేన ఫిర్యాదు

సరుబుజ్జిలి, మార్చి 8(ఆంధ్రజ్యోతి): టెక్కలి నియోజకవర్గానికి చెందిన వైసీపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌పై జనసేన పార్టీ నాయకులు పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌పై దువ్వాడ శ్రీనివాస్ అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నట్టు, అతడిపై చర్యలు తీసుకోవాలని కోరినట్టు జనసేన పార్టీ మండల అధ్యక్షుడు పైడి మురళీమోహన్, పార్టీ నాయకులు ధనుంజయ్, తేజేశ్వరరావు, రమణ, అప్పలరాజు, శ్రీధర్, రామకృష తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్

ఆమదాలవలస, మార్చి 8(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్టు టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని విద్యాసాగర్ అన్నారు. శనివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో వివిధ సమస్యలపై ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రజా దర్బార్‌లో నియోజకవర్గం నుంచి వివిధ సమస్యలపై 107 దరఖాస్తులు వచ్చాయన్నారు. టీడీపీ నాయకులు మురళి, శివ్వాల సూర్యం, ఆనెపు రామకృష్ణ, పల్లి సురేష్, అంబళ్ల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై గ్రామసభ

పొందూరు, మార్చి 8(ఆంధ్రజ్యోతి): ఉపాధి పనుల్లో అవినీతికి, అక్రమాలకు తావులేకుండా కొనసాగించేందుకే సామాజిక తనిఖీలు చేపడుతున్నట్టు రాష్ట్ర రిసోర్స్‌పర్సన్ (ఎస్ఆర్‌పీ) పున్నయ్యనాయుడు అన్నారు. మండల కేంద్రంలోని సచివాలయంలో పొందూరు పంచాయతీ పరిధిలో 2023-24 ఏడాదిలో జరిగిన ఉపాధి పనులపై గ్రామసభ నిర్వహించారు. అర్హత ఉన్న ప్రతీ వ్యక్తి ఉపాధి పనులు కల్పిస్తామన్నారు.

శాంతారాం సేవలు మరువలేనివి

పొందూరు, మార్చి 8(ఆంధ్రజ్యోతి): సమాజానికి, కళారంగానికి శాంతారాం చేసిన సేవలు మరువలేనివని పీయూసీ ఛైర్మన్, ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. మండల కేంద్రంలో ప్రజా, ఉపాధ్యాయ సంఘాలు, కళారంగ సభ్యులు నిర్వహించిన శాంతారం సంతాపసభలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా శాంతారాం చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు రామ్మోహన్, కూన సత్యనారాయణ, సర్పంచ్ ఆర్.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించేందుకే ప్రజావారధి

రణస్థలం, మార్చి 8(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు పరిష్కరించేందుకే ప్రజా వారధి కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. శనివారం ఆయన ఆధ్వర్యంలో క్యాంపు కార్యాలయంలో జరిగిన ప్రజావారిధి కార్యక్రమంలో 400 ఫిర్యాదులు వచ్చాయి. దశల వారీగా సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కూటమి నాయకులు ముప్పిడి సురేష్, లంక శ్యామలరావు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

ఆమదాలవలస, మార్చి 8(ఆంధ్రజ్యోతి): ఇటీవల మరణించిన వారి కుటుంబాలను శనివారం వైసీపీ నేత, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం పరామర్శించారు. బూర్జ మండలం కొరగాం గ్రామానికి చెందిన మాజీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పుచ్చ రామచంద్రరావు తండ్రి ఇటీవల మృతి చెందారు. ఆ కుటుంబాన్ని పరామర్శించారు. అలాగే బొరగవలస గ్రామానికి చెందిన దన్నాన ఆనందరావు కుమార్తె ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆ కుటుంబాన్ని సీతారాం పరామర్శించారు.

క్రైం కార్నర్

4.596 కేజీల గంజాయి స్వాధీనం

● తమిళనాడు వాసి అరెస్ట్


మాట్లాడుతున్న సీఐ రామారావు, ఎస్ఐ లావణ్య

పాతపట్నం, మార్చి 8(ఆంధ్రజ్యోతి): ఆంధ్రా ఒడిశా సరిహద్దు చెక్ పోస్టు వద్ద ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 4 కేజీల 596 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వి.రామారావు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వివరాలు వెల్లడించారు. ఆ మేరకు.. తమిళనాడు రాష్ట్రం తిరువెల్లూరు జిల్లా తిరుమళైయాల్ గ్రామ సన్నతి వీధికి చెందిన ధనుష్ ఏకాంబరం అనే యువకుడు ఒడిశాలోని బల్లిగూడ ప్రాంతానికి చెందిన రాజు దొర అలియాస్ బాయ్ వద్ద 4.596 కేజీల గంజాయిని రూ.10 వేలకు కొనుగోలు చేసి చెన్నై వెళ్లేందుకు బయలుదేరాడు. విశాఖపట్నం, చెన్నై రైలు ఎక్కేందుకు సిద్ధమయ్యాడు. ఈ క్రమంలో గంజాయి బ్యాగుతో పర్లాకిమిడి నుంచి పాతపట్నం నడుచుకుంటూ వస్తుండగా ఆంధ్రా ఒడిశా బోర్డర్ చెక్‌పోస్టు వద్ద పోలీసులకు పట్టుబడ్డాడు. ధనుష్ ఏకాంబరం బీఏ చదువుకునే రోజుల్లోనే గంజాయికి అలవాటు పడ్డాడు. వైజాగ్ రైల్వేస్టేషన్ వద్ద బల్లిగూడ ప్రాంతానికి చెందిన రాజుదొర తో పరిచయం ఏర్పడింది. అతని వద్ద నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి చెన్నైలో అధిక ధరకు అమ్మకం జరపాలనే ఉద్దేశంతో తరలిస్తున్నాడు. గంజా యి రవాణా కేసులో గతంలో తిరువళ్లూరు పోలీసులకు పట్టుబడి జైలుకు కూడా వెళ్లాడని సీఐ తెలిపారు. కాగా గంజాయి రవాణాను అడ్డు కోవడంలో క్రియాశీలకంగా వ్యవహరించిన సీఐ రామారావు, ఎస్ఐ లావణ్య, ఏఎస్ఐ కె.కృష్ణారావు, కానిస్టేబుళ్లు బి.గోపాలరావు, జి.మన్మథరావులను ఉన్నతాధికారులు అభినందించారు. ఈ మేరకు సదరు వ్యక్తిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. సమావేశంలో ఎస్ఐ లావణ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఆమదాలవలసలో కేసు నమోదు

ఆమదాలవలస, మార్చి 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైల్వేస్టేషన్ జంక్షన్‌లో ఉన్న ఒక కిల్లీ బడ్డీలో గంజాయి విక్రయిస్తున్న పొట్నూరు కృష్ణారావుపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ ఎస్.బాలరాజు శనివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. గత సోమవారం దుకాణం వద్దకు శ్రీకాకుళం టాస్క్‌ఫోర్స్ సభ్యులు మఫ్టీలో వచ్చి గంజాయి కొనుగోలు చేశారు. అనంతరం ఆ దుకాణాన్ని తనిఖీ చేసి నిందితుడిని ఆమదాలవలస పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు. దీనిపై విచారణ చేపట్టి పట్టణంలోని డాబాల వారి వీధికి చెందిన కృష్ణారావుపై కేసు నమోదు చేశారు. అతడి వద్ద నుంచి 70 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని ఆమదాల వలస జూనియర్ సివిల్ కోర్టుకు తరలించినట్టు ఎస్ఐ తెలిపారు.

ఆ పాపం వైసీపీ ప్రభుత్వానిదే: బగ్గు

నరసన్నపేట, మార్చి 8(ఆంధ్రజ్యోతి): గంజాయి సాగును ప్రోత్సహించి యువత భవిష్యత్‌తో ఆటలాడుకున్నది వైసీపీ ప్రభుత్వమేనని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. గంజాయి సేవించిన ఆగంతుడి ఘాతుకానికి బలైన గున్నమ్మ కుటుంబ సభ్యులను శనివారం పరామర్శించారు. యువత భవిష్యత్‌కు బాటలు వేసేందుకు సీఎం చంద్రబాబునాయుడు నాయుడు గంజాయి రవాణా, సాగును అరికట్టేందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేశారన్నారు. యువత గంజాయి, మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. నరసన్నపేట పట్టణంలో గత ప్రభుత్వ హయాంలో గంజాయికు అలవాటు పడిన వారిని పట్టుకొని రిమాండ్‌కు తరలించడం జరిగిందని. అయితే వైసీపీ నాయకులు రాజకీయం చేస్తున్నారన్నారు.

ఉప్పుడు బియ్యంతో వెళ్తున్న లారీ బోల్తా

నరసన్నపేట, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీరాంపురం వద్ద జాతీయ రహదారిపై శనివారం మధ్యాహ్నం లారీ అదుపు తప్పి డివైడర్ ఢీకొని సర్వీసు రోడ్డుపై బోల్తాపడింది. ఈ ఘటనలో లారీ డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. అయితే ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. పశ్చిమ బెంగాల్ రాష్ట్రం ఖర్గపూర్ నుంచి తమిళనాడు ఉప్పుడు బియ్యంతో వెళుతున్న లారీ బోల్తా పడింది. అదే సమయంలో నరసన్నపేట నుంచి ఉర్లాం సర్వీసు రోడ్డులో ఒక ఆటో వెళ్లగా త్రుటిలో ఈ ప్రమాదం నుంచి తప్పుకుంది. దీంతో ఆటోలో వెళుతున్న ప్రయాణికులు ఊపిరిపీల్చు కున్నారు. లారీ డ్రైవర్ నిద్రమత్తే ప్రమాదానికి కారణంగా తెలుస్తోంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ దాలినాయుడు తెలిపారు.

రైలు ఢీకొని ఒకరి మృతి

టెక్కలి, మార్చి 8(ఆంధ్రజ్యోతి): రావివలస జంక్షన్ సమీపంలో శనివారం సాయంత్రం రైలు పట్టాలు దాటుతుండగా ఓ వ్యక్తి మృతి చెందాడు. గుణుపూర్ నుంచి విశాఖ వెళ్తున్న రైలు ఢీకొనడంతో ధర్మనీలాపురం గ్రామానికి చెందిన గురువెల్లి కృష్ణారావు (67) అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. మృతదేహాన్ని కుటుంబసభ్యులు ఘటనా స్థలం నుంచి ఇంటికి తీసుకువెళ్లారు.

ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వరా?

● మండల సమావేశంలో ప్రశ్నించిన సభ్యులు

పలాసరూరల్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): సరైన సమాచారం ఇవ్వకుండా అధికారులు నేరుగా ప్రజల వద్దకు వెళ్తున్నారని, అసలు ప్రజా ప్రతినిధులకు విలువ లేదా అని పలువురు సభ్యులు ప్రశ్నించారు. ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం ఎంపీపీ ఉంగ ప్రవీణ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్ శాఖల వివరాలను అధికారులు ప్రకటిస్తుండగా రెంటికోట, మాకన్నపల్లి సర్పంచ్‌లు ఎస్.తిరుమలరావు, టి.మదన్ మాట్లాడుతూ.. గ్రామాల్లోకి అధికారులు వచ్చినపుడు ప్రజాప్రతినిధులకు సరైన సమా చారం ఇవ్వకుండా నేరుగా లబ్ధిదారుల వద్దకు వెళుతున్నారని, ప్రొటోకాల్ ప్రకారం తీర్మానాలకు విలువ ఇస్తున్నారు తప్ప ఇతర విషయాల్లో కనీస గౌరవం ఇవ్వడం లేదని నిలదీశారు. కొన్ని పంచాయతీల్లో పూర్తిస్థాయిలో ఇవ్వలేదని, ఇచ్చిన ట్యాప్‌లకు సరైన ప్లాట్‌ఫారాలు లేకపోవడంతో అవి వాలిపోతున్నాయని సభ దృష్టికి తీసుకు వచ్చారు. బొడ్డపాడు, రెంటికోటల్లో కొళాయిలు పూర్తి స్థాయిలో ఇవ్వలేదని, తగు చర్యలు తీసుకోవాలని కోరారు. మహిళా దినోత్సవం సందర్భంగా ఎంపీపీ ప్రవీణతో పాటు ఇతర మహిళా ప్రజాప్రతినిధులకు సత్కరించారు.

కిడ్నీ బాధితుల సమస్యకు పరిష్కారం చూపాలి


'ఉద్దానం కిడ్నీ విషాదాలు' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

పలాసరూరల్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): ఉద్దానం కిడ్నీ బాధితుల సమస్య కు శాశ్వత పరిష్కారం కనుగొనాలని వక్తలు అన్నారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం రాయ్‌పూర్‌లో శనివారం ద్వితీయ తెలుగు మహాసభలు ప్రారంభ మయ్యాయి. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, మాజీ మంత్రి మండలి బుద్ధప్రసాద్, సినీ నటుడు సాయి కుమార్, గజల్ శ్రీనివాస్, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళా కారుడు బద్రి కూర్మారావు ఆధ్వ ర్యంలో రూపొందించిన 'ఉద్దానం కిడ్నీ విషాదాలు' పుస్త కాన్ని అతిథులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాకారులు డాక్టర్ కుమార్ నాయక్, లండ రుద్ర మూర్తి, తెప్పల కృష్ణమూర్తి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

భక్తుల ఇలవేల్పు.. వల్లభ నారాయణుడు

● నేటి నుంచి 14 వరకు రట్టిలో డోలోత్సవాలు
● ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

హరిపురం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): భక్తుల ఇలవేల్పు.. నూతన జంటల కోర్కెలు తీర్చే కొంగు బంగారం వల్లభ నారాయణుడు. మందస మండలం తీర ప్రాంతంలోని రట్టిలో కొలువైన వల్లభ నారాయణ స్వామి డోలోత్సవాలు ఆదివారం నుంచి 14వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఆరు రోజుల పాటు జరగనున్న ఈ ఉత్సవాల కోసం నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. ప్రతి యేటా ఫాల్గుణ మాసం శుద్ధ దశమి నుంచి పౌర్ణమి వరకు ఉత్సవాలు నిర్వహిం చడం ఇక్కడి ఆనవాయితీ. చరిత్రకారుల కథనం మేరకు దేవతలు నిర్మించినట్టు చెబుతున్న ఈ పురాతన ఆలయంలో శిల్ప సౌందర్యం ఎంతో ఆకట్టుకునే విధంగా ఉంటుంది. ఈ ఆలయం 218 ఏళ్ల క్రితం నిర్మితమైనట్టుగా ఇక్కడి కట్టడాల ద్వారా తెలుస్తోంది.

గరుడ స్తంభం విశిష్టత..

ఇక్కడి గరుడ స్తంభాన్ని ఆలింగనం చేసుకుంటే సంతానం కలుగుతుందని భక్తుల నమ్మకం. అన్ని పుణ్యక్షేత్రాలు దర్శించి.. చివరిగా రట్టి వల్లభనారాయణ స్వామి దర్శనంతో సంపూర్ణ యాత్ర ముగిస్తారు. ఒడిశా, కోల్‌కతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు ఇక్కడి యాత్రలో పాల్గొనటం విశేషం. జీవనోపాధి కోసం వలస పోయిన ఈ ప్రాంత ప్రజలు యాత్రలో పాల్గొనేందుకు స్వగ్రామాలకు చేరుకుంటారు. వల్లభనారాయుడికి మట్టి కలశంతో అమృత ప్రసాదం తయారుచేసి దర్శించుకున్న తరువాత గరుడ స్తంభాన్ని ఆలింగనం చేసుకుంటారు. అనంతరం సముద్ర స్నానాలా చరించి.. ఆలయ సమీపంలోని తోటల్లో వంటలు చేసుకొని దైవప్రసాదంగా స్వీకరించి ఉత్సవాలను ముగిస్తారు. వల్లభనారాయణ స్వామివారి డోలోత్సవాలు ఈనెల 9న ఆదివారం రాత్రి 9 గంటలకు అంకురార్పణతో ప్రారంభమవుతాయి. 14న శుక్రవారం పౌర్ణమి రోజున డోలోత్సవాలు, కోలసేవతో ఉత్సవాలు ముగుస్తాయి.


వల్లభ నారాయణ స్వామి ఆలయం(ఇన్‌సెట్‌లో మూలవిరాట్టు)

ప్రత్యేక ఏర్పాట్లు..

భక్తుల సౌకర్యార్థం దేవాలయం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్టు దేవాలయ ఇన్‌చార్జి ఈవో వాసుదేవరావు తెలిపారు. మంచినీటి సదుపాయంతో పాటు ఉచిత వైద్య సేవలు అందించనున్నారు. భక్తులకు ప్రత్యేక క్యూలైన్లతో పాటు తలనీలాలు సమర్పించేందుకు ప్రత్యేక గదిని ఏర్పాటు చేశారు. హరిపురం-బాలిగాం కూడలి నుంచి ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు నడపనున్నారు. ఈ సందర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు.

జాతీయ లోక్ అదాలత్‌తో ప్రయోజనం


టెక్కలి: లోక్ అదాలత్ నిర్వహిస్తున్న న్యాయాధికారులు

టెక్కలి, మార్చి 8(ఆంధ్రజ్యోతి): స్థానిక కోర్టు సము దాయాల పరిధిలో శనివారం జాతీయ లోక్ అదాలత్ ను సీనియర్ సివిల్ న్యాయాధికారి జె.శ్రీనివాసరావు, జూనియర్ సివిల్ న్యాయాధికారి డి.భరణి నిర్వహించారు. లోక్‌అదాలత్‌తో కక్షిదారులకు ప్రయోజనం కలు గుతుందన్నారు. ఈ సందర్భంగా 184 కేసులు పరిష్కారమైనట్లు వారు తెలిపారు. సివిల్ కేసులు నాలుగు, చెక్ బౌన్స్ కేసు ఒకటి, క్రిమినల్ కేసులు 47, ఎక్సైజ్ కేసులు 28, ప్లీబార్గయినింగ్ ద్వారా రాజీ అయిన కేసులు 101, మనోవర్తి కేసులు మూడు ఉన్నాయ న్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దివ్వల వివేకానంద, అదాలత్ సభ్యులు ధర్మరాజు, శ్రీనివాసరావు, న్యాయవాదులు, సిబ్బంది పాల్గొన్నారు.

నరసన్నపేటలో 143 కేసులు..

నరసన్నపేట, మార్చి 8(ఆంధ్రజ్యోతి): లోక్ అదాలత్‌తో కేసులు ఇరుపార్టీలు ఆమోదంతో తక్షణమే పరిష్కరించడం జరుగుతుందని సివిల్ కోర్టు న్యాయాధికారి హరిప్రియ అన్నారు. శనివారం స్థానిక కోర్టులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. 146 కేసులగాను 143 కేసులను పరిష్కరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అబ్కారీ, పోలీసుశాఖ అధికారులతో పాటు బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురంలో 130..

ఇచ్ఛాపురం, మార్చి 8(ఆంధ్రజ్యోతి): స్థానిక కోర్టు ఆవరణలో జూనియర్ సివిల్ న్యాయాధికారి పి.ఫరీష్ కుమార్ ఆధ్వర్యంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా 130 కేసులు పరిష్కరించారు. అపరాధ రుసుంగా రూ.41,300, సివిల్ సెటిల్‌మెంట్ కేసుల ద్వారా రూ.1.05 లక్షలు వసూలు చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఎన్.రమణయ్యరెడ్డి, సీతయ్యరెడ్డి, సాహు, దేవరాజ్‌రెడ్డి పాల్గొన్నారు.

సోంపేటలో 47..

సోంపేట, మార్చి 8(ఆంధ్రజ్యోతి): స్థానిక కోర్టు ఆవరణలో శనివారం జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ న్యాయాధికారి జె.శ్రీనివాసరావు, న్యాయవాది కె.రాజు ఆధ్వర్యంలో ఒక బెంచ్, జూనియర్ సివిల్ న్యాయాధికారి పి.నరేష్ కుమార్, న్యాయవాది డి.రుక్మంగదుడు ఆధ్వర్యంలో రెండో బెంచ్ ఏర్పాటు చేసి కేసుల విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా 47 కేసులు పరిష్కరించగా రూ.1,03,323 అపరాధ రుసుం విధించారు.

ఇరువర్గాలకు న్యాయం

పొందూరు, మార్చి 8(ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్ అదాలత్ ద్వారా ఇరువర్గాలకు న్యాయం జరుగుతుందని పొందూరు జూనియర్ సివిల్ న్యాయాధికారి బి.జ్యోత్స్న అన్నారు. స్థానిక కోర్టులో శనివారం లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ లోక్‌అదాలత్‌లో 308 కేసులు పరిష్కరించగా ఇందులో నాలుగు సివిల్, 304 క్రిమినల్ కేసులు ఉన్నాయన్నారు. లోక్ అదాలత్ సభ్యులు రాము, న్యాయవాదులు కె.రమణమూర్తి, కిరణ్, అశోక్, సంతోష్, పోలీసు, కోర్టు సిబ్బంది ఉన్నారు.


పొందూరు: మాట్లాడుతున్న న్యాయాధికారి జ్యోత్స్న

కొత్తూరులో 259..

కొత్తూరు, మార్చి 8(ఆంధ్రజ్యోతి): కొత్తూరు సివిల్ కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 259 కేసులు పరిష్కరించినట్లు న్యాయాధికారి మణి తెలిపారు. రాజీ పడదగ్గ కేసులు 22, మనోవర్తి 2, ఎక్సైజ్ 35, సివిల్ 7, ఇతర చిన్నచితక కేసులు 193 పరిష్కరించామన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్లు రఘునందనరావు, రాడ రాజు, న్యాయవాదులు అప్పారావు, ఉమా మహేశ్వరరావు, ధర్మారావు, కొత్తూరు సీఐ సిహెచ్ ప్రసాద్, ఎస్ఐ అమీర్ ఆలీ తదితరులు పాల్గొన్నారు.


నరసన్నపేట: లోక్‌అదాలత్ నిర్వహిస్తున్న న్యాయాధికారి హరిప్రియ



ఇచ్ఛాపురం: మాట్లాడుతున్న న్యాయాధికారి ఫరీష్‌కుమార్


సోంపేట: లోక్ అదాలత్ నిర్వహిస్తున్న దృశ్యం

మహిళాభివృద్ధికి ప్రాధాన్యం: మంత్రి అచ్చెన్న



కోటబొమ్మాళి, మార్చి 8(ఆంధ్రజ్యోతి): మహిళల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం తొలి ప్రాధాన్యం ఇస్తుందని రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. అంత ర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం అమరావతి నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు. మహిళలను మహాశక్తిగా, అన్ని రంగాల్లో సాధికారత సాధించేలా ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటోందన్నారు. మహిళ సమానత్వం, సాధికారత, హక్కుల పరిరక్షణకు ఆది నుంచి కృషి చేస్తోంది టీడీపీ ప్రభుత్వమని, సీఎం చంద్రబాబు స్వయంగా రూపుదిద్దిన స్వర్ణాంధ్ర విజన్-2047 డాక్యుమెంట్‌లో సైతం మహిళా సాధికారత, క్షేమం, భద్రతకు ప్రాముఖ్యమిస్తూ లక్ష్యాలను నిర్దేశించారన్నారు. మహిళలందరికీ మహిళాదినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

ఎల్లమ్మా.. కరుణించమ్మా..

(ఐదో పేజీ తరువాయి)


అమ్మవారిని దర్శించుకుంటున్న గౌతు శివాజీ

అమ్మవారిని దర్శించుకున్నారు. మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావు పర్యవేక్షించారు. కాశీబుగ్గ డీఎస్పీ వి.వెంకటఅప్పారావు, సీఐ పి.సూర్యనారాయణ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థులు భక్తులకు సేవలందించారు. లయన్స్ క్లబ్ వనిత విభాగం ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. దీన్ని మున్సిపల్ చైర్మన్ బళ్ల గిరిబాబు ప్రారంభించారు. ప్రభుత్వ వైద్యాధికారి ఎంవి.జ్యోత్స్న, వైద్యాధికారి డాక్టర్ బాలకృష్ణ రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అలాగే వజ్రపుకొత్తూరు, సంతబొమ్మాళి మండలాల్లో ఎల్లమ్మ యాత్రకు భక్తులు పోటెత్తారు.


సంతబొమ్మాళి: మర్రిపాడు ఎల్లమ్మ జాతరకు పోటెత్తిన భక్తులు


వజ్రపుకొత్తూరు: బైపల్లిలో ఎల్లమ్మను దర్శించుకుంటున్న భక్తులు

హక్కులు కల్పించినప్పుడే మహిళలకు గౌరవం

కాశీబుగ్గ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): శ్రామిక మహిళలను ఆర్థికంగా ఎదగనిచ్చి వారికి హక్కులు కల్పించినప్పుడే గౌరవం లభించినట్లని సీఐటీయూ జిల్లా కార్యదర్శి గణపతి, ఏపీ ఎన్జీవో సంఘం అధ్యక్షుడు గోపాల్, ఐద్వా జిల్లా కమిటీ సభ్యురాలు ఢిల్లేశ్వరి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినో త్సవం సందర్భంగా శనివారం సీఐటీయూ, ఐద్వా, శ్రామిక మహిళా సమ న్వయ కమిటీ ఆధ్వర్యంలో ర్యాలీ, అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా సంఘాల సభ్యులు భాగ్యలక్ష్మి, సుహాసిని, ఆశ, జ్యోతి, భానమ్మ, పలువురు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నేటి గుర్తింపునకు నాటి పోరాటాలే స్ఫూర్తి

పలాసరూరల్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): నేడు మహిళలకు వస్తున్న గుర్తింపునకు నాటి పోరాటాలే కారణమని ఐప్వా మహిళ సంఘ నాయకులు అన్నారు. బొడ్డపాడులో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఉత్తర అమెరికా ఖండం న్యూయార్కులో మహిళా కార్మిక పోరాటాల ఫలి తంగానే అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఏర్పడిందన్నారు. అనంతరం ప్లకార్డులను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఐప్వా సంఘ నాయకులు మద్దిల కామమ్మ, వరలక్ష్మి, రాజులమ్మ, ఉమ, కామాక్షమ్మ, పలువురు కార్యకర్తలు, నేతలు పాల్గొన్నారు.

ప్రాథమిక విద్య బలోపేతానికి చర్యలు

పాతపట్నం, మార్చి 8(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక విద్యను బలోపేతమే పునర్వ్యవస్థీకరణ లక్ష్యమని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధి లోని ఐదు మండలాల ఎంఈవోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాథమిక విద్యను అందరికీ అందుబాటులోకి తీసుకురావాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం జీవో 117 రద్దు చేసిందన్నారు. అలాగే పంచాయతీకి ఒకటి చొప్పున ఆదర్శ ప్రాథమిక పాఠశాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటోందన్నారు. ప్రభుత్వ లక్ష్యం సాధించేందుకు అంద రూ భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో శ్రీధర్ రాజా, ఎంఈ వోలు, ఇతర అధికారులు పాల్గొన్నారు. ● పారిశుధ్య కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. పాతపట్నంకు చెందిన పారిశధ్య కార్మి కులు సమస్యలపై వినతి పత్రం అందించారు. కనీస వేతనం అమలు చేయాలని, పనికి తగ్గ వేతనం ఇవ్వాలని కోరారు. సకాలంలో వేతనా లివ్వాలన్నారు. కార్యక్రమంలో పలువురు పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

ఆవిష్కరణలకే కంపెనీల ప్రాధాన్యం

● టెక్ మహీంద్ర వైస్ ప్రెసిడెంట్ నాగార్జున

టెక్కలి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): కోర్సులు ఏవైనా ఆవిష్కరణలకే కంపెనీలు అధిక ప్రాధాన్యత ఇస్తాయని, ఆ దిశగా విద్యార్థులు దృష్టి సారించాలని, అప్పుడే ఆకాశమే హద్దుగా అవకాశాలు వస్తాయని టెక్ మహీంద్ర వైస్‌ప్రెసిడెంట్ మల్లాడి నాగార్జున అన్నారు. శనివారం ఆదిత్య ఇంజ నీరింగ్ కళాశాల వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా సాంకేతికతకు ఉన్న అవకాశాలు వివరించారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, డేటా సైన్స్, సైబర్ టెక్నాలజీలతో పాటు మెకానికల్ వంటి కోర్ ఇంజనీరింగ్‌కు మంచి అవకాశాలున్నాయన్నారు. ఎంటెక్, బీటెక్, ఎంబీఏ కోర్సుల్లో అత్యధిక మార్కులు సాధించిన 74 మందికి మెరిట్ స్కాలర్‌షిప్‌లతో పాటు బంగారు, వెండి పతకాలను అందజేశారు. కళాశాల చైర్మన్ డాక్టర్ కె.సోమేశ్వరరావు మాట్లాడుతూ.. భాగ్యలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా చదివిస్తున్న పేద విద్యార్థులకు రూ.50 లక్షలకు పైగా ప్రోత్సాహక బహుమతులు అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నామన్నారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. విద్యార్థుల కేరింతలతో క్యాంపస్ మారుమోగింది. కార్యక్రమంలో కార్యదర్శి ఎల్ఎల్ నాయుడు, కోశాధికారి టంకాల నాగరాజు, వైస్‌ప్రెసిడెంట్ సుధాప్రియ, డైరెక్టర్లు వీవీ నాగేశ్వరరావు, డాక్టర్ కొంచాడ రవికుమార్, నాగేశు, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసరావు, కన్వీనర్ డాక్టర్ విజయ్‌కుమార్, కో-కన్వీనర్ శివశంకర రాజు, ఎంఎస్ఆర్ నాయుడు స్వప్నరేఖ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్ అందిస్తున్న టెక్ మహీంద్ర వైస్‌ప్రెసిడెంట్ నాగార్జున

న్యూస్ బాక్స్

పారిశుధ్య కార్మికులకు గ్లౌజులు పంపిణీ

టెక్కలి, మార్చి 8(ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో పారిశుధ్య మహిళా కార్మికులకు శనివారం బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో గ్లౌజులు, బిస్కెట్లు పంపిణీ చేశారు. నిరంతరం ప్రజల ఆరోగ్యం కోసం శ్రమి స్తున్న మహిళా పారిశుధ్య కార్మికుల రుణం తీర్చుకోలేమని సంఘ సభ్యులు అన్నారు. ఆ సంఘ అధ్యక్షులు మామిడి శ్రీనివాసరావు, వి.రాజేష్, శ్రీనివాస్, సీతా పతి తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

టెక్కలి, మార్చి 8(ఆంధ్రజ్యోతి): పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రోణంకి రామచంద్రరావు కోరారు. శనివారం సంఘ భవనంలో విశ్రాంత ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. సీనియర్ సిటిజన్ ఐడీ కార్డులు ఇప్పించేందుకు చర్యలు తీసుకుంటామని, ఈనెల 20వ తేదీ వరకు లైవ్ సర్టిఫికేట్లకు గడువు పెం చారన్నారు. ఈ గడువులోగా అందరూ సర్టిఫికేట్లు అందజేయాలన్నారు. పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయులకు సత్కరించారు. కార్యక్రమంలో కార్యదర్శి ధనుం జయరావు, జీవీ రెడ్డి, బొడ్డ అయ్యబాబు, మూల తాతయ్య తదితరులు పాల్గొన్నారు.

మందిర నిర్మాణానికి భూమిపూజ

హిరమండలం, మార్చి 8(ఆంధ్రజ్యోతి): హిరమండలంలో సత్యసాయి నూతన మందిర నిర్మా ణానికి శనివారం భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు మాట్లాడుతూ బాబా శతజయంతి నాటికి మందిర నిర్మాణ పనులు పూర్తిచేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా మందిర నిర్మాణానికి రాజాం పట్టణానికి చెందిన కె.చంద్రకళ ఆమె భర్త గోపాల రావు జ్ఞాపకార్థం రూ.లక్ష విరాళం అందజేశారు. ప్రేమసాయి వృద్ధాశ్రమానికి చెందిన రామలక్ష్మి మందిర నిర్మాణానికి రూ.లక్ష విరాళం అందించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు అబ్బాయి, సెక్రటరీ అందవరం బుచ్చి అబ్బాయి, ఏవీ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దానప్ప సంబరాలు

నరసన్నపేట, మార్చి 8(ఆంధ్రజ్యోతి): జల్లువానిపేటలో ఏటా మహాశివరాత్రి తరువాత వచ్చే శనివారం నుంచి రెండు రోజుల పాటు నిర్వహించే దానప్ప సంబరాలు ఘనంగా నిర్వహించారు. గ్రామ శివారులోని పుట్టకు ప్రత్యేక పూజలు చేశారు. ఒడిశా, విశాఖపట్నం, రాజమండ్రి, హైదరాబాదు తదితర ప్రాంతాల నుంచి జల్లు వంశీయులు వచ్చి మొక్కలు చెల్లించుకున్నారు. ఆదివారం కూడా సంబరాలు నిర్వహించనున్నట్లు జల్లు అప్పలనాయుడు తెలిపారు.

ఉమాసోమేశ్వర స్వామి కల్యాణం

ఎల్.ఎన్.పేట, మార్చి8 (ఆంధ్రజ్యోతి): రావిచెంద్రి ఉమాసోమేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణం శనివారం ఘనంగా జరిగింది. జడ్పీటీసీ మాజీ సభ్యుడు ఎస్.తేజేశ్వరరావు ఆధ్వ ర్యంలో పురోహితులు మధుబాబు, మోహనరావు శాస్త్రోక్తంగా ఈ కార్యక్ర మం చేపట్టారు. ప్రతీ ఏటా ఉత్తరాయణం ఫాల్గుణ మాసంలో స్వామి కల్యాణం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని గ్రామస్థులు తెలిపారు.

వరకట్నం వేధింపులపై కేసు

కొత్తూరు, మార్చి 8(ఆంధ్రజ్యోతి): భర్త, అత్తమామలు, మరిది అధిక వరకట్నం తీసుకు రమ్మని నిత్యం వేధిస్తున్నారని బమ్మిడి గ్రామానికి చెందిన కూన సంతోష్ కుమారి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నలుగురిపై నమోదు చేసినట్లు కొత్తూరు ఎస్ఐ అమీర్ ఆలీ తెలిపారు.

ద్రాక్ష పండ్ల వ్యాన్ బోల్తా

(ఐదో పేజీ తరువాయి)

పడిపోయాయి. దీంతో స్థానికులు, వాహనదారులు ఆ ద్రాక్షపండ్లను ఏరుకునేందుకు ఎగబడ్డారు. సుమారు అరగంట పాటు ట్రాఫిక్ స్తంభించిపోయింది. వ్యాన్ బోల్తా పడడంతో డ్రైవర్ సంతోష్, తకరాం బాబర్, యజమాని మదకర్ మహదేవ్‌కు స్వల్పగాయాలయ్యాయి. వ్యాన్‌లో చిక్కుకున్న వారిని బయటకు తీసేందుకు ఎవరూ సహకరించక.. పండ్లను తీసుకెళ్లే ప్రయత్నంలోనే నిమగ్నమయ్యారు. విషయం తెలుసుకున్న ఎచ్చెర్ల ఎస్ఐ సందీప్.. తన సిబ్బందితో అక్కడకు చేరు కుని రోడ్డుకి అడ్డంగా పడి ఉన్న వాహనాన్ని పక్కకు తీయించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఈ ప్రమాదం డ్రైవర్ తప్పిదం వల్లే సంభవించినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఈ ఘటనపై ఎస్ఐ సందీప్ కేసు నమోదు చేశారు.

ఆక్రమణల తొలగింపు

పోలాకి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): పోలాకిలో మురుగు కాలువలపై ఉన్న ఆక్రమణలను తొలగించి కాలువలోని సిల్ట్ తీసే ప్రక్రియను చేపడుతున్నారు. కాలువల్లోని నీరు వెళ్లేందుకు అవకాశం లేకుండా పోవడంతో సర్పంచ్ మజ్జిలక్ష్మీ రమణమ్మ ఆధ్వర్యంలో బీసీ కాలనీ నుంచి వెదుళ్లవలస గ్రామం వరకు ఇరువైపులా ఉన్న బడ్డీలను తొలగించి కాలువ పనులు చేపడుతున్నారు. ఎంపీటీసీ తూలుగు కుమారి, సర్పంచ్ మజ్జిరమణమ్మ, పాలక వర్గ సభ్యులు దగ్గరుండి విస్తరణ పనులు చేయించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.